


అనుమతి లేని
హోర్డింగ్‌లపైనా హైడ్రా కన్ను


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 1   సంచిక - 359   శుక్రవారం 14 ఫిబ్రవరి 2025   ఎడిటర్ : బిర్రు కరుణాకర్   పేజీలు -5   వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts


# అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ



రాయబారి వినయ్ క్వాత్రా స్వాగతం
ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్‌తో చర్చలు
ఎలన్‌మస్క్‌తోనూ చర్చించే ఛాన్స్
చారిత్రక బ్లెయిర్ హౌజ్‌లో మోడీకి బస



2లో



గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ నూతన
క్యాంపస్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్
హైదరాబాద్‌తో మైక్రోసాఫ్ట్ సంస్థకు
సుదీర్ఘ అనుబంధం ఉందన్న రేవంత్ రెడ్డి
భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్
ఇంటెలిజెన్స్‌దే అన్న ముఖ్యమంత్రి
మైక్రోసాఫ్ట్ విస్తరణ ద్వారా మరిన్ని ఉ
ద్యోగాలు వస్తాయన్న రేవంత్ రెడ్డి

# భవిష్యత్తు అంతా ఏఐదే

హైదరాబాద్,ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):
హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ నూతన క్యాంపస్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరానికి మైక్రోసాఫ్ట్ సంస్థకు మధ్య సుదీర్ఘ అనుబంధం ఉందని అన్నారు.భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని ఆయన పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ సంస్థ చేస్తున్న కృషిలో భాగంగా 500 పాఠశాలల్లో ఏఐని వినియోగిస్తూ బోధన జరుగుతోందని తెలిపారు మిగతాది 2లో...



## హైదరాబాద్‌లో గూగుల్ ఏఐ సెంటర్ ఏర్పాటు

సీఎం రేవంత్ సమక్షంలో కుదిరిన ఎంవోయూ

## పార్లమెంట్ ముందుకు కొత్త ఐటి చట్టం

నిరసనల మధ్యే ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్
విపక్షాల వాకౌట్...లోక్‌సభ మార్చి 10కి వాయిదా



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):
ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. దీనిలో భాగంగా ఆదాయపు పన్ను (ఐటీ) నూతన బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. విపక్షాల నిరసనల మధ్యే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ప్రకటించిన మేరకు బిల్లును తీసుకుని వచ్చారు. అయితే విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. బిల్లుకు నిరసనగా వాకౌట్ చేయడం గమనార్హం. అనంతరం కాసేపటికే లోక్‌సభ మార్చి 10కి వాయిదా పడింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, ఎన్నో సవరణలు జరిగాయి.మిగతాది 2లో...

## పదో తరగతి పరీక్షల్లో కీలకమార్పు

విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ సూచన
మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ ప్రీఫైనల్...
మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పబ్లిక్ పరీక్షలు

హైదరాబాద్,ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి వార్షిక పరీక్షల్లో కీలక మార్పు తీసుకురానున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రంలో వివరాలను నింపడం నుంచి తదితర అంశాలను కొత్తగా చేర్చనున్నారు.మిగతాది 2లో...



## బిఆర్ఎస్ పాలనలో యువతను మత్తులో ముంచారు

క్యాసినో జూదానికి కేంద్రంగా చేశారు
కెటిఆర్, సంతోష్ కనుసన్నల్లో ఫామ్‌హౌజ్ దందాలు
టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపణలు

హైదరాబాద్,ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫాంహౌజ్ కోళ్ళపందాల ఘటన దుమారం రేగుతోంది. బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్, సంతోష్ కనుసన్న ల్లోనే పోచంపల్లి ఫాంహౌజ్ దందా నడిచిందని మిగతాది 2లో...



# 19న బిఆర్ఎస్ సమావేశం

కెసిఆర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు   ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించే అవకాశం

**హైదరాబాద్,ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):**
ఈ నెల 19న భారత రాష్ట్ర సమితి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరుగనున్నది. తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశాశం జరుగనుంది. త్వరలోనే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుక జరుగనున్నది. ఈ క్రమంలో నే విస్తృత స్థాయి కార్యవర్గాన్ని సమావేశ పరచాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు భేటీ నిర్వాహణకు సంబంధించి పార్టీ కార్యవర్గ నిర్వహణ అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ భేటీలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం, నిర్మాణాత్మక అంశాలపై చర్చించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలలపై చర్చించడంతో పాటు వాటిని ఎండగట్టేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి.. ప్రజలను చైతన్యం చేసేందుకు మిగతాది 2లో...



## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన



కేంద్ర హెూంశాఖ నోటిఫికేషన్
ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేసిన రోజుల వ్యవధిలోనే రాష్ట్రపతి పాలన
జాతుల మధ్య ఘర్షణతో అట్టుడుకుతున్న మణిపూర్

ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):
మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించింది. జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధిస్తున్నట్లు కేంద్ర హెూంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు.మిగతాది 2లో...

## వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

నిరసనల మధ్యే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం
-గందరగోళం మధ్య సభ వాయిదా



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త): 'వక్ఫ్ సవరణ బిల్లు-2024'పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది.మిగతాది 2లో...

## లోన్ కట్టకపోతే గేటును ఎత్తుకెళ్తారా..?

స్వరాష్ట్రంలో రైతులకు వేధింపులు
రుణమాఫీ చేయని సీఎంను మరీ ఏం చేస్తారు..?
ఎక్స్‌వేదికగా బ్యాంకు సిబ్బందిపై తీరుపై కేటీఆర్ మండిపాటు



2లో.

## బిసి జాబితాలో ముస్లింలను చేరిస్తే ఊరుకోం

మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం
కు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్



2లో.

# అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ



వాషింగ్టన్,ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):
అమెరికాలో రెండు రోజుల పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, ఇతర అధికారులు ప్రధాని మోదీని విమానాశ్రయంలో స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం గురువారం అమెరికాకు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం మేరకు ఆయన అమెరికా పర్యటన చేపట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి, భారతదేశం-యుఎస్ఎ సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించడానికి ఎదురుచూస్తున్నాను. మన దేశాలు, మన ప్రజల ప్రయోజనం కోసం మెరుగైన భవిష్యత్తు కోసం కలిసి పనిచేస్తూనే ఉంటాయి' అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం తెల్లవారు జామున అమెరికాకు చేరుకున్నారు. ఫ్రాన్స్‌లో తన రెండు రోజుల పర్యటనను ముగించిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి. వారు ప్రతినిధి స్థాయి ఫార్మాట్లలో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారు. గురువారం వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగే సమావేశానికి ముందు మోడీ అదనపు సుంకాల కోతలకు సిద్ధమవుతున్నారు. ఇది భారతదేశానికి అమెరికన్ ఎగుమతులను పెంచవచ్చు.

అధ్యక్షుడు ట్రంప్, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్‌తో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా మోదీకి భారత సంతతి వారు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రత్యేకమైన అతిథి గృహంలో బస చేస్తున్నారు. 1651 పెన్సిల్వేనియా అవెన్యూలోని బ్లెయిర్ హౌస్ ఆయనకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ భవనం శ్వేత సౌధానికి ఎదురుగా ఉండటం దీని విశేషం. అమెరికాలో పర్యటించే అత్యంత ప్రత్యేకమైన అతిథులకు ఇక్కడ బస ఏర్పాటు చేస్తారు. గతంలో చాలా మంది దేశాధ్యక్షులు, రాజకుటుంబ సభ్యులకు దీనిని విడిదిగా వాడారు. దౌత్యపరంగా ప్రాధాన్యమున్న భవనంగా దీనిని భావిస్తారు. ఇది కేవలం విలాసవంతమైన గెస్ట్‌హౌస్ మాత్రమే కాదు. అమెరికా ఆతిథ్యానికి చిహ్నంగా నిలిచింది. దాదాపు 70 వేల చదరపుటడుగుల్లో నాలుగు భవనాలు అనుసంధానమై ఉండటం దీని ప్రత్యేకత. ఇక్కడ మొత్తం 119 గదులు ఉన్నాయి. వీటిలో 14 బెడ్రూమ్‌లు, 35 బాత్ రూమ్‌లు, మూడు డైనింగ్ గదులున్నాయి. అత్యాధునిక బ్యూటీ సెలూన్ కూడా దీనిలో ఉంది. ఇక్కడి వచ్చిన అతిథులకు ఫైవ్‌స్టార్ ఆతిథ్యం ఇస్తారు. అమెరికా చరిత్రను తెలిపే పురాతన వస్తువులు, ఆర్ట్స్‌తో దీనిని అలంకరించారు. 1824లో ఈ భవనాలను నిర్మించారు. ప్రెస్టోన్ ఫ్రాన్సిస్ బ్లెయిర్ 1837లో కొనుగోలు చేశారు. ఆయన పేరును దీనికి పెట్టారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత శ్వేతసౌధానికి అతిథుల తాకిడి గణనీయంగా పెరిగింది. చాలా దేశాధినేతలు, సైన్యాధినేతలు అక్కడే బస చేసేవారు. ఆ తర్వాత 1942లో అమెరికా ప్రభుత్వం ఈ హౌస్‌ను అద్దెకు తీసుకొంది. ఆ ఏడాది చివరి నాటికి 1.56లక్షల డాలర్లకు కొనుగోలు చేసింది. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆ దేశ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బర్డ్‌తో భేటీ అయ్యారు. వీరిద్దరూ పలు అంశాలపై చర్చించారు. డీఎన్ఐగా ఆమె నేడు పదవీ బాధ్యతలు చేపట్టడం విశేషం.

# లోన్ కట్టకపోతే గేటును ఎత్తుకెళ్తారా..?

**స్వరాష్ట్రంలో రైతులకు వేధింపులు**
**రుణమాఫీ చేయని సీఎంను మరీ ఏం చేస్తారు..?**
**ఎక్స్‌వేదికగా బ్యాంకు సిబ్బందిపై తీరుపై కేటీఆర్ మండిపాటు**

హైదరాబాద్,ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త): రైతులపై బ్యాంకు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు సరైందికాదని, కొన్ని సంఘటనలు చూస్తే మనసు చలిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. స్వరాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని..కష్టాల్లో ఉన్న పాడి రైతు లోన్ కట్టలేదని.. ఏకంగా ఆ ఇంటికి ఉన్న గేటును బ్యాంక్ సిబ్బంది ఎత్తుకెళ్లారని.. మరి రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని.. మాటతప్పిన ముఖ్యమంత్రిపై చర్య తీసుకునే ధైర్యముందా అని ప్రశ్నించారు. రుణం తీర్చలేదని రైతుపై చూపిన ప్రతాపాన్ని.. రుణమాఫీ చేయని సీఎం రేవంత్ రెడ్డిపై చూపించగలరా.. అని అన్నారు. పేద రైతు కు ఒక న్యాయం.. పదవిలో ఉన్న వారికి మరో న్యాయమా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టుకోవాలని, రైతులు అంతా గమనిస్తున్నారని.. ఇలాంటి ఘోరాలను చూస్తూ ఊరుకోరని.. కాంగ్రెస్ నేతల్ని ఇంటి గేటు కూడా తొక్కనియ్యరని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాగా బ్యాంకులో తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదని బ్యాంకు అధికారులు ఇంటి గేట్లు ఎత్తుకెళ్లిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడునూతులలో తండా మంజుల, మద్దెబోయిన ప్రేమలతలకు పాడిగేదెల కోసం జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉన్న డీసీసీబీ రూ.8.72 లక్షల రుణం 2021 అక్టోబరులో ఇచ్చింది. ఒక్కో గ్రూపునకు ఐదుగురు చొప్పున రెండు గ్రూపుల్లో మొత్తం 10మంది తలా ఒక పాడిగేదె కొన్నారు. అయితే కొంత అప్పు కట్టినా రెండు గ్రూపులు కలిపి మొత్తం రూ.7 లక్షల బాకీ చెల్లించలేదు. వాస్తవానికి 2023లోనే ఈ రుణ వాయిదాలు పూర్తి కావాల్సి ఉంది. దీంతో బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు 2023 అక్టోబరులో లీగల్ నోటీసులు పంపారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం లబ్ధిదారుల ఇంటికి బ్యాంకు సిబ్బంది లీగల్ నోటీసులు ఇవ్వడానికి వె ళ్లారు. ఈ సందర్భంగా గట్టిగా అడగడంతో రూ.3 లక్షలు చెల్లించారు. అయితే రెండు రోజుల్లో మొత్తం చెల్లిస్తామన్నా వినకుండా బ్యాంకు సిబ్బంది తమ ఇంటి గేట్లు తీసుకెళ్లారని మద్దెబోయిన ప్రేమలత ఆరోపించారు. అయితే వారే తమ గేట్లు తీసుకెళ్లమన్నారని డీసీసీబీ కొడకండ్ల బ్రాంచ్ మేనేజర్ కళ్యాణి తెలిపారు.

# బిఆర్ఎస్ పాలనలో యువతను మత్తులో ముంచారు

**(మొదటి పేజి తరువాయి)**
టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో యువతను మత్తు లో ముంచారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్యాసినో హబ్ గా కేటీఆర్ మార్చారని విమర్శించారు. బీఆర్ ఎస్ హయాంలో రాష్ట్రంలో రాక్షసపాలన సాగింది. కేటీఆర్ డ్రగ్స్ తో తెలంగాణను నాశనం చేశారు.. బినామీలకు క్యాసినో, కోళ్ల పందాలు అప్పగించారని అన్నారు. కేటీఆర్, సంతోష్ కుమార్ లకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి భాగస్వాములుగా ఉన్నారని చెప్పారు.



బీఆర్ ఎస్ హయాంలో సన్ బర్న్ పార్టీలో పేరుతో హైదరాబాద్ లో పాశ్చాత్య సంస్కృతిని తీసుకొచ్చిన చరిత్ర బీఆర్ ఎస్ నేతలదని విమర్శించారు. జన్వాడ ఫాం హౌ జ్ కేసులో డ్రగ్స్ ఇచ్చిన కేసులో పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి లిందని అనుమానాలు వ్యక్తం చేశారు. అన్నారు. ఫాంహౌజ్ లలో క్యాసినో, పేకాట, కోళ్ల పందేలు ఆడి స్తూ తెలంగాణ సమాజాన్ని జూదం వైపు మళ్లిస్తున్నారని అన్నారు. కేటార్ అండతోనే ఇలాంటి పనులు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ లో జరిగే అన్ని రకాల జూదాలకు కేటిఆరే నాయకుడు. బీఆర్ ఎష్ నేతలు ఏదో అవినీతిలో భాగస్వాములే అన్నారు. అందరిపైనా విచారణ జరిపి తెలంగాణ యువతను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# బిసి జాబితాలో ముస్లింలను చేరిస్తే ఊరుకోం

**మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం**
**కు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే**
**కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్**



హైదరాబాద్,ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త): మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. బిసి జాబితాలో ముస్లింలను చేరిస్తే ఆమోదించే ప్రసక్తే లేదని అన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రంపై నెట్టాలనుకోవడం మూర్ఖత్వమని విమర్శించారు. బిసి రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ కు లేదనేది తేట తెల్లమైందన్నారు. బిసిల్లో ముస్లింలను చేర్చడం వల్ల బిసిలకు రిజర్వేషన్లు తగ్గుతాయని చెప్పారు. బిసిలకు కాంగ్రెస్ మరింత అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే బిసి జాబితా నుంచి ముస్లింలను తొలగించాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం కాంగ్రెస్ కు లేదని దుయ్యబట్టారు. ఎన్నికలు నిర్వహించకపోతే ఆర్థిక సంఘం నిధులు రావని, నిధులు రావని తెలిసినా స్థానిక సంస్థల ఎన్నికలను ఎందుకు జాప్యం చేస్తున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ? 'బీసీ జాబితాలో ముస్లింలను చేరిస్తే ఆమోదించే ప్రసక్తే లేదు. మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం. ఈ విషయం తెలిసి కూడా కేంద్రంపై నెట్టాలనుకోవడం మూర్ఖత్వం. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని తేటతెల్లమైంది. బీసీల్లో ముస్లింలను చేర్చడంవల్ల బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లు దక్కకుండా పోతాయి. కాంగ్రెస్ పార్టీ బీసీలకు మరింత అన్యాయం చేస్తోంది. ముస్లింలను బీసీల్లో కలిపితే హిందూ సమాజమంతా తిరగబడటం ఖాయం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడం తథ్యం. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే బీసీ జాబితాలో నుండి ముస్లింలను తొలగించాల్సిందే. ఎన్నికల హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందే' అని అన్నారు. 'ఇచ్చిన మాట తప్పుతూ బీసీలను నిండా ముంచుతున్న పార్టీ కాంగ్రెస్. బీసీలంతా కాంగ్రెస్ మోసాలను గుర్తించాలని కోరుతున్నా. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము కాంగ్రెస్‌కు లేదు. మార్చిలోపు స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే తెలంగాణకు నష్టమని తెలీదా?. 15వ గ్రాంట్స్ కమిషన్ నిధులు ఆగిపోతాయని తెలిసి కూడా జాప్యం చేస్తారా?. ఇప్పటికే రెండు దఫాలుగా నిధులు రాలేదు. 73, 74వ రాజ్యాంగ సవరణలను ఉల్లంఘిస్తున్నారు. స్థానిక సంస్థలకు ఐదేళ్లకోసారి తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగం చెబుతోంది. మీరు ఆమోదించిన రాజ్యాంగాన్ని మీరే అవమానిస్తారా. రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరగడం కాదు.. రాజ్యాంగాన్ని అమలయ్యేలా చూడాలి. సర్పంచ్ లేకుంటే గ్రామ సభలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జరిగేదెలా?. గ్రామాల్లో పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నా పట్టించుకోరా?. ఓడిపోతామనే భయానికే స్థానిక ఎన్నికలు నిర్వహించడం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

**(మొదటి పేజి తరువాయి)**
అనంతరం కొద్ది రోజుల వ్యవధిలోనే కేంద్రం రాష్ట్రపతి పాలన విధించింది.
మణిపూర్ గవర్నర్ సమర్పించిన నివేదికతో పాటు ఇతర నివేదికల సమాచారాన్ని పరిశీలించిన మీదట అక్కడ రాజ్యాంగబద్ధ పాలనను కొనసాగించే పరిస్థితి లేదని అంచనాకు వచ్చామని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రపతికి సంక్రమించిన అధికారాలతో రాష్ట్రపతి పాలన విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాల్లో పేర్కొన్నట్లు వెల్లడించింది.

# పార్లమెంట్ ముందుకు కొత్త ఐటి చట్టం

**(మొదటి పేజి తరువాయి)**దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు ఇప్పుడు బిల్లును రూపొందించారు. ఈ చట్టాన్ని సమీక్షించడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది. చట్ట సమీక్షకు 22 ప్రత్యేక సబ్ కమిటీలనూ ఏర్పాటు చేశారు. మొత్తం మీద కొత్త చట్టం సమీక్ష నిమిత్తం 6500 సలహాలను ఆదాయ పన్ను విభాగం అందుకుంది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, కొత్త బిల్లు తీసుకొచ్చారు. మొన్నటి బడ్జెట్‌లో కూడా ఆదాయపు పన్న విషయంలో సరళీకరణ చేపట్టామని అన్నారు. అందుకు అనుగుణంగా కొట్ట ఐటి చట్టానికి ఇటీవలే కేబినేట్ ఆమోదించింది. దానికి చట్టబద్దత కల్పించేందుకు పార్లమెంటు ముందుకు తీసుకుని వచ్చారు.

----------

# వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**(మొదటి పేజి తరువాయి)**
జేపీసీకి చైర్మన్‌గా వ్యవహరించిన జగదంబికా పాల్, బిజెపి ఎంపీ సంజరు తదితరులు ఈ ముసాయిదా బిల్లుపై తమ నివేదికను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సభ ముందుకు తీసుకొచ్చారు. ఈ బిల్లుపై నివేదికను రాజ్యసభ ఎంపీ మేధా కులకర్ణి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. నివేదికపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. తాము సమర్పించిన డిస్సెంట్ (అసమ్మతి) నోట్‌ను తొలగించారంటూ నిరసనకు దిగారు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ 20 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఈ నిరసనల మధ్యే ఈ నివేదికకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కాగా, జనవరి 29న ముసాయిదా నివేదికను జెపిసి ఆమోదించిన విషయం తెలిసిందే. బీజేపీ సభ్యులు సూచించిన 14 సవరణలను కమిటీ ఆమోదించింది. అయితే కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, శివసేన(యూబీటీ), ఏఐఎంఐఎంతోసహా ప్రతిపక్ష సభ్యులు సూచించిన ప్రతి మార్పును కమిటీ తిరస్కరించింది. ఈ సవరణలతో వక్ఫ్‌బోర్డులలో ముస్లిమేతరులు కూడా సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లుపై ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టి త్వరితగతిన ఆమోదింపజేసుకుంది.

# పదో తరగతి పరీక్షల్లో కీలకమార్పు


**(మొదటి పేజి తరువాయి)**
దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షల్లోనే నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రీ ఫైనల్ పరీక్షలు మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షల్లో టెన్త్ విద్యార్థులందరికీ ఓఎంఆర్ పత్రాలను అందించనున్నారు. విద్యార్థులకు అందించే ఈ ఓఎమ్ఆర్ పత్రాల్లో ప్రతి విద్యార్థి తనకు ఇచ్చిన ఆన్సర్ బుక్‌లెట్ సంఖ్యను రాయాల్సి ఉంటుంది. అలాగే దానిపై సంతకం కూడా చేయాలి. విద్యార్థికి సంబంధించిన ఇతర వివరాలు కూడా అందులో ముందుగానే ముద్రించి ఉంటాయి. వాటిని విద్యార్థులు సరిచూసుకోవాలి. వివరాల్లో తప్పులున్నా.. ఆ ఓఎంఆర్ తనది కాకపోయినా.. విద్యార్థులు వెంటనే ఇన్విజిలేటర్‌కు చెప్పాల్సి ఉంటుంది. అలాగే వారిచ్చే ఇతర నామినల్ రోల్ పత్రంలో సరైన వివరాలను రాయాల్సి ఉంటుంది. ఇక ఈ పరీక్షలు ముగిసిన తర్వాత మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల్లో ప్రతిరోజూ ఓఎంఆర్ పత్రాలను విద్యార్థులకు అందిస్తారు. నేరుగా పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రాలను ఇవ్వడం వల్ల విద్యార్థులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉంది. అందువల్ల కొందరు విద్యార్థులు తప్పులు చేసే అవకాశం ఉంది. మరికొందరికి సమయం వృథా అయ్యే ఛాన్స్ ఉంది. దీన్ని నివారించేందుకు ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. దీనివల్ల విద్యార్థులకు కొంత సాధన అవుతుందని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. అలాగే గత ఏడాది వరకు 4 పేజీల మెయిన్ బుక్‌లెట్ తొలుత జారీ చేసి.. అది సరిపోకపోతే అదనపు షీట్లను ఇచ్చేవారు. దీంతో అదనపు షీట్ల సంఖ్యను కూడా ఓఎంఆర్ పత్రంపై రాసేవారు. అయితే ఈసారి మాత్రం ఇంటర్మీడియట్ తరహాలో 24 పేజీల బుక్‌లెట్‌ను పదో తరగతి విద్యార్థులకు కూడా ఇస్తున్నారు. దీనివల్ల బుక్‌లెట్‌పై అదనపు పత్రాల సంఖ్య రాయవల్సిన అవసరం ఉండదు. ఇలాంటి మార్పులన్నింటి దృష్ట్యా ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని విద్యాశాఖ భావిస్తుంది.

# 19న బిఆర్ఎస్ సమావేశం

**(మొదటి పేజి తరువాయి)**
అనుసరించాల్సిన విధానాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. కేసీఆర్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ, ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పోరేషన్ ఛైర్మన్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు.. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు హాజరవుతారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలమీద ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణపై సమగ్ర చర్చ జరగనుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం అనుసరించాల్సిన వ్యూహాలు విధానాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. సమగ్ర చర్చ జరిపి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే కీలక సమావేశం కాబట్టి ఆహ్వానితులందరూ రావాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

# భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే

**(మొదటి పేజి తరువాయి)**
. మైక్రోసాఫ్ట్ విస్తరణ ద్వారా తెలంగాణలోని యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ): హైదరాబాద్‌లో గూగుల్ ఎఐ సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు సిఎం రేవంత్ సమక్షంలో ప్రభుత్వంతో గూగుల్ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకుంది. టి హబ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిఎం రేవంత్, ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాఉబ, సెక్రటరీ జయేశ్ రంజన్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. కృత్రిమ మేధతో పాటు అంకుర పరిశ్రమలకు గూగుల్ తోడ్పాటును అందించనుంది. వ్యవసాయం, విద్య,రవాణారంగం, డిజిటల్ రంగంలో గూగుల్ సహకారం అందిస్తుందని ఆ సంస్థ ప్రతినధులు ప్రకటించారు.



# స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్

## - వార్డుల వారీగా బాధ్యుల నియామకం - కమిటీని ప్రకటించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

వర్ధన్నపేట/ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త): స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్ చేసుకొని రాజకీయ పార్టీలు వ్యూహాలు పన్నుతున్నారు. దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలలో ఇదే వ్యవహారం కొనసాగుతోంది. వందకు వందశాతం అన్ని స్థానాలు దక్కించుకోవాలని కార్యకర్తలకు బాధ్యతలను ఇస్తున్నారు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని 12 వార్డులకు సంబంధించిన బాధ్యులను తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రకటించారు. ఈ బీఆర్ఎస్ పార్టీ వర్ధన్నపేట మండల అధ్యక్షులు తూల్ల కుమారస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన నియామక కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రానికి చెందిన వారు బాధ్యతలు స్వీకరించారు. పట్టణ అధ్యక్షునిగా గోధుమల మధుసూదన్, ప్రధాన కార్యదర్శులు ఎండి అజీమ్ పూర్తిస్థాయి కమిటీని ప్రకటించినట్లు తెలిపారు. ఈసారి జరగబోయే ఎన్నికల్లో వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని 12 వార్డులు కైవసం చేసుకోనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. గడిచిన ఒక్క సంవత్సరం కాలంలోనే ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై విరక్తి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా పది సంవత్సరాల కాలంలో అన్ని వర్గాల వారికి సమానాత్వాన్ని కల్పిస్తూ, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ పార్టీనీ, పరిపాలన విధానాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ఈసారి జరగబోయే ఏ ఎన్నికల్లోనైనా సరే బిఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వార్డుల వారిగా బాధ్యతలు చేపట్టినవారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ, పార్టీ గెలుపు సాధనకై కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# పబ్లిసిటీతో పనిలేదు!

## - అభివృద్ధి జరగడమే ముఖ్యం - వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి













హనుమకొండ/ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త): ప్రజా క్షేత్రంలో ప్రజలచేత ఎన్నికైన తనకు పబ్లిసిటీతో పనిలేదని, ప్రజల అవసరాలు, నియోజకవర్గ అభివృద్దే ముఖ్యమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ పరోధిలోని 49వ, డివిజన్లో రెవెన్యూ కాలనీ, లోటస్ కాలనీ, ప్రకాశ్ రెడ్డి, ఇందిరమ్మ కాలనీలలో ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు విస్తృతంగా పర్యటించారు. అన్ని కాలనీలలో నడుస్తూ నేరుగా సమస్యలను గుర్తించడంతోపాటు ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. డివిజన్లో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమాని, అత్యవసరంగా ఉన్న కాలనీలలో రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైన్ నిర్మాణాల వీలైనంత త్వరగాతిన పనులను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. స్థానికంగా ఉన్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాలను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రకాష్ రెడ్డిపేటలో స్థానిక మహిళలు విద్యుత్తు స్థంభం సమస్య ఉందని తెలిపారు. విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతుంటే అధికారుల దృష్టికి తక్షణమే తిసుకువెళ్ళమని స్థానిక నాయకులకు సూచించారు. ఇందిరమ్మ కాలనీలో గడిచిన పదేళ్లలో కేవలం కాలనీ పేరు చూసి పట్టించుకున్న నేతలు లేరని వాపోయారు. ఎమ్మెల్యే వేంటనే స్థానికంగా కావాల్సిన పనులను అంచనాలు వేసీ తీసుకురావాలని నేతలకు తెలిపారు. అనంతరం స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలసి సమావేశామయ్యారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం, సంక్షేమ పథకాల అమలు, ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, పార్టీ కార్యకర్తల బాగోగులు దృష్టికి తీసుకురావాలని కోరారు. దళారీ వ్యవస్థ లేకుండా నిష్పక్షపాతంగా, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా పార్టీ నాయకులు చూసుకోవాలని కోరారు. ప్రతిపక్ష పార్టీ నేతలు డివిజన్ లలో ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని సూచించారు. డివిజన్ లలో నాయకులు ఐక్యతతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఏనుగు మానస రామ్ ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు రాజమల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్ నాయకులు రఘుపల్ రెడ్డి, రాజు, కరణ్, ఎంఎ సమద్, సతీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో మంత్రి పొంగులేటి సుడిగాలి పర్యటన

పాల్వంచ/ఫిబ్రవరి13(జర్నలిస్ట్ వార్త):తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్వంచ పట్టణంలో గురువారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. పర్యటనలో భాగంగా స్థానికంగా ఉన్న పెద్దమ్మతల్లి ఆలయాన్ని , శివాలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. అదేవిధంగా స్థానిక ఫంక్షన్ హాల్లో జరిగిన బత్తుల అంజి సోదరుని కుమారుని వివాహానికి హాజరయ్యారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు. నిండు నూరేళ్ళ చల్లగా ఉండాలని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఇటీవల వివాహం జరిగిన నవీన్ దంపతులను కేశవాపురంలోని వారి ఇంటి వద్ద ఆశీర్వదించి పట్టు వస్త్రాలను కానుకగా అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన చీకటి కార్తీక్ గాంధీ భవన్ లో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసేందుకు వెళ్తూ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన టీం ఆధ్వర్యంలో మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించారు. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. పలు ప్రైవేట్ కార్యక్రమాల్లోనూ పొంగులేటి పాల్గొన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, జారే ఆదినారాయణ తదితరులు ఉన్నారు.





# అనుమతి లేని హోర్డింగ్‌లపైనా హైడ్రా కన్ను

## కోమటికుంటలో అక్రమ కట్టడాల తొలగింపు

హైదరాబాద్,ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త): ఆక్రమణలకు గురైన చెరువులను పునరుద్ధరించేందుకు కీలకంగా వ్యవహరిస్తోన్న హైడ్రా.. అనుమతిలేని హోర్డింగ్‌లపై దృష్టి సారించింది. శివారు మున్సిపాలిటీలైన శంషాబాద్, కొత్వాల్‌గూడ, నార్సింగి, తొండుపల్లి, గొల్లపల్లి రోడ్డు, తెల్లాపూర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటి వరకు 53 భారీ హోర్డింగ్‌లను హైడ్రా సిబ్బంది తొలగించారు. మరో వైపు యాడ్ ఏజెన్సీ ప్రతినిధులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమావేశమయ్యారు. అనుమతిలేని హోర్డింగ్‌లను తొలగిస్తామని హెచ్చరించారు. ఇదిలావుంటే తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజల్ గ్రామంలోని కోమటి కుంటలో గురువారం హైడ్రా అక్రమ కట్టడాలను తొలగించింది. కోమటికుంట ఎఫ్‌టీఎల్ లో నిర్మాణాలపై హైడ్రాకు స్థానికులు ఫిర్యాదులు చేశారు. హైడ్రా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో పూర్తి స్థాయి విచారణ చేపట్టింది. కోమటి కుంట చెరువు పరిధిలో నిర్మించిన ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్వెన్షన్ కు ఎలాంటి నిర్మాణ అనుమతులు లేవని వెల్లడింది.. అలాగే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఈ నిర్మాణాలు జరిగినట్టు విచారణలో తేలడంతో కూల్చివేతలకు ఆదేశించింది. హైడ్రా నోటీసులపై ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్వెన్షన్ ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన వాటిని కూల్చివేయాలంటూ హైకోర్టు తీర్పు ఇచ్చింది.. తామే తొలగిస్తామని.. 30 రోజుల సమయం కావాలని హైకోర్టును ప్రకృతి రిసార్ట్స్ నిర్వాహకులు కోరారు.. 30 రోజులు దాటినా వాటిని తొలగించకపోవడంతో..నేరుగా రంగంలోకి దిగి కూల్చివేతలు చేపట్టారు.

# గంజాయి పట్టుకున్న ఐనవోలు పోలీసులు

## - ముగ్గురిపై కేసు నమోదు చేసిన ఎస్ఐ శ్రీనివాస్



**ఐనవోలు/ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):** మండలంలోనివనమాలకనపర్తి గ్రామ శివారులో గురువారం ఎస్సై పస్తం శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి ముగ్గురు వ్యక్తులు ఎస్సారెస్పీ కెనాల్ వద్ద నుండి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని గమనించిన తన సిబ్బందితో పాటు ఎస్సై చేదించి వారిని పట్టుకున్నారు. ఆ ముగ్గురు వ్యక్తులని సోదా చేయగా వారి వద్ద 200 గ్రాముల రెండు గంజాయి లాభ్యమైందని ఎస్సై తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారుగా 5000 రూపాయల విలువ ఉంటుందని అంచనా వేస్తున్నారు. గంజాయిని ప్రజల సమక్షంలోనే స్వాధీనం చేసుకుని గంజాయి తరలించేందుకు ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# వ్యవసాయ పొలంలో నాటు వేసిన ఫారెస్ట్ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్



సత్తుపల్లి/ఫిబ్రవరి13(జర్నలిస్ట్ వార్త): వ్యవసాయ పొలంలో ఫారెస్ట్ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ గురువారం నాటు వేశారు. అనంతరం ఖమ్మం డి.ఎఫ్.ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ కనకగిరి అటవీ ప్రాంతం పరిశీలన కొరకు వెళుతుండగా మార్గం మధ్యలో సూరారం గ్రామంలో వరి నాట్లు వేస్తున్న కూలీలను చూసి ఆగి వారితో ముచ్చటించి, వారితో పాటుగా వరి నాటు వేస్తూ వ్యవసాయ వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. డివిజనల్ ఫారెస్ట్ అధికారి మంజుల మాట్లాడుతూ రైతుల పట్ల తమకున్న గౌరవ అభిమానాన్ని ఇలా వ్యక్తపరిచారని చెప్పారు. ఈ సందర్భంగా వారి వెంట రైతులు ఫారెస్ట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు పట్టుదలతో చదవాలి

## -డాన్ బాస్కో ఫాదర్ జస్టిన్






తల్లాడ/ఫిబ్రవరి13(జర్నలిస్ట్ వార్త): విద్యార్థులు పట్టుదలతో చదవాలని డాన్ బాస్కో ఫాదర్ జస్టిన్ అన్నారు. గురువారం స్థానిక డాన్ బోస్కో పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్, కెరియర్ గైడెన్స్ పై హైదరాబాద్ కు చెందిన డాన్ బాస్కో ఫాదర్ జస్టిన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పట్టుదల ఆలోచన శక్తి పెరగాలంటే ప్రతి విషయంలో ఆసక్తిగా ఉండాలని ప్రపంచవ్యాప్తంగా గొప్ప వ్యక్తులు తయారైన వాళ్ళందరూ చిన్ననాటి నుండి పట్టుదలతో చదవటంతో ఉన్నత శిఖరాలను అవరోధించారు. అనంతరం ఆయన పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాన్ బోస్కో ప్రిన్సిపల్ ఫాదర్ ప్రదీప్ రెడ్డి, జోసఫ్, రవి, సిస్టర్ కిరణ్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఎర్రబెల్లి ఆశీర్వాదం



రాయపర్తి/ ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కసరబోయిన కుమార్ కుమారుడు నాగరాజు – సౌజన్య వివాహ వేడుకలో గురువారం మాజీ మంత్రి,పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్,బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రంగు కుమార్ గౌడ్,పూస మధు, బందెల బాలరాజు, ఎలమంచి శ్రీనివాస్ రెడ్డి, లేతాకుల మధుకర్ రెడ్డి, గారె నర్సయ్య, చిన్నాల రాజబాబు, ఐత కుమార్, ఎండి అక్బర్, చందు రాము, చందు సతీష్, ఉబ్బని కిషోర్, గారె నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉమేష్ కి ఘన సన్మానం



**బోథ్ /ఫిబ్రవరి13 (జర్నలిస్ట్ వార్త):** బోథ్ మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు, సొసైటి డైరెక్టర్ చట్ల ఉమేష్ ను స్థానిక మైసమ్మ కాలనీ వాసులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కాలనిలో నెలకొన్న రోడ్డు సమస్యను 'బోథ్ డెవలప్మెంట్ గ్రూప్ లో పెట్టిన వెంటనే స్పందించి సొంత నిధులతో రోడ్డు సమస్యను పరిష్కరించిందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో కలిసి కాలనీ వాసులు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు సురేష్ వైద్య మాట్లాడుతూ..యువత సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలని, గ్రామాభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. సేవకుడి వెన్నంటే తమంటూ కాలనీ యువకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సిహెచ్.రాఘవులు, బూస రాములు, భోజన్న, పాలిక్ రమేష్, అంజనా రాము, తూము భాస్కర్, శేఖర్, అల్లాడి శేఖర్, నయీమ్, రాములు, శంకర్, ప్రకాష్, బారె సాయి కిరణ్, కంఠం ఆకాష్, బొడ్డు మల్లేష్, మణికంఠ, కాలనీ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### - అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

వరంగల్/ఫిబ్రవరి13(జర్నలిస్ట్ వార్త): ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లో డిఆర్ఓ విజయలక్ష్మితో కలిసి విద్యాశాఖ అధికారులతో పీఎంశ్రీ, సర్వ శిక్ష అభియాన్ పథకాల కింద చేపట్టిన పాఠశాలల అభివృద్ధి, మరమ్మత్తు పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద పాఠశాలల అభివృద్ధి నిమిత్తం కోటి 38 లక్షల రూపాయల వ్యయంతో మంజూరైన 14 పనులు వివిధ పురోగ దశల్లో కొనసాగుతున్నాయని, అదేవిధంగా సర్వ శిక్షణ అభియాన్ పథకం కింద 45 లక్షల 40 వేల రూపాయల వ్యయంతో 12 ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ లాబరేటరీల ఏర్పాటు కొనసాగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

### - ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



రాయపర్తి, ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త): పురాతన శివాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివాలయాన్ని ఆలయ కమిటీ ఛైర్మెన్ బందేల బాలరాజు, మాజీ సర్పంచ్ గారే నర్సయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తన ఫౌండేషన్ తరుపున ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివ పార్వతుల కళ్యాణం జరిపించి, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, లేతకుల మధుకర్ రెడ్డి, చందు రాము, ఎండీ అక్బర్, చందు సతీష్, ఎండీ యూసఫ్, గారే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాలతో అనర్ధాలు



**కల్లూరు/ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):** వ్యర్ధాలతో అనర్ధాలు ఎదుర్కో వల్సి వస్తుందని ఖాన్ ఖాన్ పేట పంట ప్రజలు వాపోతున్నారు.కల్లూరు ప్రభుత్వం జూనియర్ కాలేజ్ సమీపంలో సాగర్ కాల్వ కట్ట మీద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ వలన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని ఖాన్ ఖాన్ పేట పంట పొలాల రైతులు చెపుతున్నారు. కరెంట్ ఆఫీస్ దగ్గరలో ఉండే ప్రజలు,గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ , స్కూల్, నూతనంగా నిర్మించినటువంటి మినీ స్టేడియం వాకర్స్ కోసం రన్నర్స్ కోసం స్పోర్ట్స్ 400 ట్రాక్ ఉదయం పూట సాయంత్రం పూట చాలామంది కల్లూరు పట్టణ ప్రజలు ఆరోగ్యం కోసం వాకింగ్ రన్నింగ్ చేస్తూ ఉంటారు. స్కూల్ కాలేజ్ విద్యార్థినీ విద్యార్థులు సాయంత్రం పూట ఇదే గ్రౌండ్లో ఆటలు ఆడుతూ ఉల్లాసంగా గడుపుతారు. డంపింగ్ లో వేసిన చెత్తకు మంట పెట్టడం వలన వచ్చే పొగ వలన విద్యార్థినీ విద్యార్థులు,కల్లూరు ఖాన్ ఖాన్ పేట ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు . ప్రస్తుత కల్లూరు గ్రామపంచాయతీ ఈవో ఈ విషయం మీద ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఈ డంపింగ్ యార్డ్ ని ఈ ప్రాంతాలకు కొంచెం దూరంగా ఏర్పాటు చేయ్యాలని . అధికారులు స్పందించి ప్రజలకు ఇబంది కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలి

### - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

**వరంగల్ బ్యూరో/ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త):** వరంగల్‌జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో జిల్లాలోని ఎంజీఎం, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి, నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రి, నర్సింగ్ కాలేజ్, వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, సాధించిన లక్ష్యాలు, అవసరాలపై కలెక్టర్ కూలంకషంగా సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మాతా శిశు సంరక్షణ కేంద్రం, టి దయాగ్నస్టిక్ హబ్, ఎం ఎల్ హెచ్ పి పనితీరు వంటి పలు అంశాలపై కలెక్టర్ చర్చించి వైద్య అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలన్నారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాల ద్వారా మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసావాలు జరిగేలా పర్యవేక్షణ జరగాలని, ప్రసావానికి దగ్గరగా ఉన్న గర్భిణులను రెగ్యులర్గా మానిటరింగ్ చేయాలన్నారు. రెగ్యులర్ చెకప్ సకాలంలో జరగాలని, ఏఎంసి రిజిస్ట్రేషన్ 100 శాతం కావాలన్నారు. ఆసుపత్రుల్లో అవసరమైన వారికి మందులు అందుబాటులో ఉంచి, రోగులకు అందేలా చూడాలని తెలిపారు. డయాగ్నస్టిక్ హబ్ ద్వారా ప్రస్తుతం ఫలితాలు ఆలస్యంగా అందుతున్నాయని, వీటిని తగ్గించి త్వరితంగా (ఫలితాల) రిపోర్ట్ ఇచ్చేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. పరీక్షా నమూనాలు టి హబ్ ద్వారా త్వరగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించి, రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గుర్తించి, లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. ప్రతి ఆసుపత్రిలో పేషంట్ల హక్కులు, కర్తవ్యం వివరాలు తెలిపే బోర్డును ప్రదర్శించాలన్నారు.

సికేఎం ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని, సివిల్ వర్క్స్ చేయుటకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని సూపరింటెండెంట్ ను ఆదేశించారు. పేషేంట్ల సౌకర్యార్థం ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఆప్తోమిక్ సర్జన్ ను డెప్యూటేషన్ ప్రాతిపదికన నియమించుటకు చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ ఆదేశించారు. నర్సంపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆన్లైన్లో తరగతులు నిర్వహించబడుతున్నాయని, ఆఫ్లైన్లో తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఎంజీఎం ఆసుపత్రిలో శవ పరీక్షల కేంద్ర మరమ్మత్తులు ఏర్పాట్లపై సమీక్షించి, అందులో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో వెంటనే ఆటో జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ప్రభుత్వాసుపత్రుల సూపరింటెండెంట్ లు కిషోర్, నరసింహస్వామి, భరత్ కుమార్, పద్మావతి, రామమూర్తి, ఆరంబోలు శ్రీనివాస్, సత్యజిత్ రే, వైద్యాధికారులు రాజు, లతా తదితరులు పాల్గొన్నారు.

# రబి సీజన్ ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలి

### - అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సత్య శారదా

వరంగల్ బ్యూరో/ఫిబ్రవరి13(జర్నలిస్ట్ వార్త): రబి సీజన్ కు సంబంధించిన ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లి అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.రబి 2024- 25 ధాన్యం సేకరణ, 2023-24 సీఎంఆర్ డెలివరీ, ప్రజా పంపిణీ వ్యవస్థ, మిల్లర్ల అసోసియేషన్ల బ్యాంకు గ్యారంటీ పత్రాల సమర్పణ తదితర అంశాలపై సూచనలు సలహాలు చేశారు. జిల్లాలో 2024 -25 రబి సీజన్లో. 2 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా ఉందన్నారు. ధాన్యాన్ని సేకరించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2023- 24 ఖరీఫ్ సీఎంఆర్ 100 శాతం వచ్చే విధంగా ఎప్పటికప్పుడు గోదాంలో ధాన్యం నిల్వలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. రైస్ మిల్లర్ల నుండి బ్యాంగ్ గ్యారెంటీ పత్రాలను తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ నుండి సరఫరా అవుతున్న బియ్యం దుర్వినియోగం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

**ఎరువులు, మందులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి**

జిల్లాలో అవసరమగు ఎరువులు, క్రిమి సంహారకాలు అందుబాటులో ఉంచుకోవాలని, ఎమ్మార్పీ ధరకే దుకాణాదారులు ఎరువులు విక్రయించేలా, విక్రయించిన ఎరువులకు బిల్లు తప్పనిసరిగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిఎఓ ను కలెక్టర్ ఆదేశించారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో ఇందిరా మహిళా క్యాంటీన్ ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్మీపురం కూరగాయల మార్కెట్లో అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి నీరజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గమ్మ తల్లి పండుగ ఉత్సవాలు

### - పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



రాయపర్తి ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ వార్త): మండలంలోని మైలారం గ్రామంలో దుర్గమ్మ తల్లి పండుగ ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు మారమ్మ తల్లికి పండుగ సందర్భంగా గ్రామస్తులు డప్పు చప్పులతో, డీజే పాటలతో బోనాలను ఎత్తుకొని మారమ్మ తల్లి చెంతకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం మారమ్మ తల్లికి బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి మారమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ విగ్రహాల నిర్మాణాల పై అధికారులకు వినతి



తల్లాడ/ ఫిబ్రవరి13(జర్నలిస్ట్ వార్త): తల్లాడ పట్టణంలోని రింగ్ రోడ్డు సెంటర్లో ఎలాంటి అనుమతి లేకుండా బిజెపి నాయకులు నిర్మిస్తున్న విగ్రహాలను తొలగించాలని గురువారం తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ఎమ్మార్వో , ఎంపీడీవో కి , పంచాయతీ ఈవో కి, తల్లాడ ఎస్సై కి, ఖమ్మం జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతి రెడ్డి, ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కటికి కిరణ్ కుమార్, రాయల రాము, అజయ్, జమాల్ షేక్, నరసింహారావు, బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రేషన్ దందాకు పాల్పడితే కఠిన చర్యలు

రాయపర్తి, ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ వార్త ): అక్రమ రేషన్ దందాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కే శ్రవణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని బాలు నాయక్ తండాలో భానోత్ సూర్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం నిల్వ చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వాదీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు 48 వేల రూపాయలు ఉంటుందని అంచనా వేశారు.

## కులగణనలో ఆదర్శంగా నిలిచిన తెలంగాణ

### సర్వేలో పాల్గొనని వారికోసం మరో ఛాన్స్

### మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

కరీంనగర్,ఫిబ్రవరి13(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే రాష్ట్రాలన్నింటికీ మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొంత మంది సర్వేలో పాల్గొనకుండా తమ సమాచారాన్ని ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. భారాస నేతలు చెబుతున్నట్లు ఇది రీసర్వే కాదని పొన్నం స్పష్టం చేశారు. సర్వేలో పాల్గొనని భారాస నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం మీద విశ్వాసం ఉంటే భారాస అగ్ర నేతలు సర్వేలో పాల్గొని తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. 'భాజపా వ్యాపారులస్తుల అనుకూల పార్టీ. కులగణన, బీసీ, ఎస్సీ వర్గీకరణ ఆ పార్టీకి ఇష్టం లేదు. ప్రజల అకాంక్షలకి అనుగుణంగా తెలంగాణలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి. సర్వే పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. సామాజిక మార్పు కలిగించే నిర్ణయం ఇది. రాజకీయ విమర్శల కొసమే భాజపా నేతలు బీసీలు, ముస్లింలపై విమర్శలు చేస్తున్నారు. ముస్లిం కమ్యూనిటీలోని పేద ముస్లింలు బీసీలోనే కొనసాగుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తాం. బలహీన వర్గాలపై చిత్తశుద్ధి ఉంటే శాసనసభలో బిల్లును అడ్డుకొవద్దు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.



# ప్రభాస్‌తో కలిసి నా 544వ ప్రాజెక్ట్ చేయడం ఆనందంగా ఉంది -అనుపమ్‌ఖేర్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ భాగమయ్యారు. ఆయన నటిస్తున్న 544వ చిత్రమిది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందంతోపాటు అనుపమ్‌ఖేర్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "ఇండియన్ చిత్ర పరిశ్రమకు బాహుబలిగా పేరుపొందిన ప్రభాస్ కలిసి నా 544వ ప్రాజెక్ట్ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై టాలెంటెడ్ హను రాఘవపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అద్భుతమైన కథ.. జీవితంలో ఇంతకంటే ఇంకేం కావాలి ఫ్రెండ్స్ జయహో" అని ట్వీట్ చేశారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. దీనికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. "మీరు ఇంతవరకూ చూడని కథను చూపిస్తున్నాం. ప్రభాస్ ఉన్నారు కాబట్టి ఎన్ని అంచనాలను అయినా అది అందుకుంటుంది. ఇప్పటివరకు ఎప్పుడూ చూడని ప్రపంచంలోకి తీసుకువెళ్తుంది. 'సీతారామం' తర్వాత దీనిని రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టింది. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారు" అని దర్శకుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇందులో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ

# అతడు నన్ను ఎంతో వేధించాడు : ఐశ్వర్య రాజేష్



దక్షిణాది చిత్రపరిశ్రమలో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. అచ్చ తెలుగు అమ్మాయి అయినప్పటికీ కోలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ డమ్ సంపాదించుకున్న ముద్దుగుమ్మ. ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో తెలుగులో భారీ విజయాన్ని అందుకుంది. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య తన సినీ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. తన తల్లి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని తెలిపింది. చిన్నతనంలోనే తన తండ్రి చనిపోయారని.. దీంతో అమ్మ ఒక్కరే ఎంతో కష్టపడి తమను పెంచిందని.. ఈ ప్రయాణంలో ఆమె మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడిందని తెలిపింది. చిన్న వయసులోనే పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేశానని.. ఆ తర్వాత సినీరంగంలోకి అడుగుపెట్టినట్లు చెప్పుకొచ్చింది. రిలేషన్ షిప్ గురించి మాట్లాడుతూ.. లవ్ కంటే కూడా బ్రేకప్ అయినప్పుడు వచ్చే బాధ అంటే భయం. ప్రేమించే సమయం కంటే అది మిగిల్చిన బాధ నుంచి బయటకు రావడానికే ఎక్కువ సమయం తీసుకుంటాను. గతంలోనూ నేను రిలేషన్ లో ఉన్నానని తెలిపింది. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఓ వ్యక్తిని ప్రేమించానని.. అతడు తనను ఎంతో వేధించాడని.. అంతకంటే ముందు కూడా అలాంటి ప్రేమనే చూశానని.. రిలేషన్ షిప్ లో ఎందుకు ఇలా జరుగుతుందని భయపడ్డానని.. ప్రస్తుతానికి ఎంతో సంతోషంగా ఉన్నట్లు చెప్పుకొచ్చింది.

# బ్యాగ్రౌండ్ లేకున్నా... తనదైన శైలిలో సినిమాలు...



సోషల్ మీడియాలో సినీతారల చిన్ననాటి ఫోటోస్ తెగ వైరలవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో హీరోయిన్ చైల్డ్ హుడ్ పిక్ నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. పైన ఫోటోలో తన తండ్రితో కలిసి ఉన్న చిన్నారి ఎవరో తెలుసా.. ? తెలుగు సినీ పరిశ్రమలో నటిగా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఎలాంటి ఫిల్మ్ బ్యాగ్రౌండ్ లేకుండానే సినిమాల్లోకి అడుగుపెట్టి సహజ నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగుతోపాటు తమిళంలోనూ వరుస ఆఫర్స్ అందుకుంది. ఇప్పటివరకు ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఇటీవలే భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాలోనూ కీలకపాత్ర పోషించింది. ఎలాంటి పాత్రలోనైనా అవలీలగా జీవించే అందమైన హీరోయిన్. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? తనే హీరోయిన్ అంజలి. ఏపీకి చెందిన ఈ అమ్మాయి.. జీవా నటించిన డేర్ సినిమాతో తెరంగేట్రం చేసింది. తర్వాత 2006లో ఫోటో సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. అయితే ఈ రెండు సినిమాలు అంజలికి అంతగా గుర్తింపు తీసుకురాలేదు. కానీ తమిళంలో సూపర్ హిట్ అయిన షాపింగ్ మాల్ సినిమాతో ఈ అమ్మడు క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఆ చిత్రాన్ని తెలుగులో డబ్ చేయగా.. అదే స్థాయిలో రెస్పాన్స్ వచ్చింది. డైరెక్టర్ మురుగదాస్ తెరకెక్కించిన జర్నీ సినిమాతో మరోసారి అడియన్స్ ముందుకు వచ్చింది. ఈ రెండు సినిమాలు అంజలి కెరీర్ మలుపు తిప్పాయి. 2013లో వచ్చిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో సీత పాత్రలో కనిపించింది. అంజలి.. అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించింది. గ్లామర్ షోలు కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంపిక చేసుకుంటూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. అలాగే లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లోనూ నటించి మెప్పించిన అంజలి.. ఇటీవలే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ మూవీలో కీలకపాత్ర పోషించింది. డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కియారా అద్వానీ కథానాయికగా నటించిన సంగతి తెలిసిందే.

# క్షమాపణలు చెప్పిన 'థర్టీ ఇయర్ ఇండస్ట్రీ' పృథ్వీ



'లైలా' సినిమా ప్రీ-రిలీజ్ వేడుకలో తాను చేసిన వ్యాఖ్యల పట్ల సినీ కమెడియన్ పృథ్వీ క్షమాపణలు చెప్పారు. ఈ సినిమా వేడుకలో తాను చేసిన వ్యాఖ్యల ద్వారా ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. తనకు ఎవరి పైనా కక్ష, ద్వేషం లేదని ఆయన స్పష్టం చేశారు.తన వల్ల సినిమాకు నష్టం వాటిల్లకూడదనే ఉద్దేశంతోనే క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. 'బాయ్‌కాట్' లైలా అని కాకుండా 'వెల్‌కం' లైలా అని ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. ఫలక్‌నుమాదాస్ కంటే 'లైలా' సినిమా గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షించారు.విశ్వక్ సేన్ కథానాయకుడిగా, రామ్ నారాయణ దర్శకత్వంలో, షైన్ స్క్రీన్స్ బ్యానర్ మీద సాహు గారపాటి ఈ సినిమాను నిర్మించారు. ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుకలో పృథ్వీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారితీశాయి.ఈ సినిమాలో తాను మేకల సత్తి అనే పాత్రను పోషించానని, సినిమా ప్రారంభంలో 150 వరకు మేకలు ఉండేవని, సినిమా పూర్తయ్యేసరికి 11 మేకలు మాత్రమే మిగిలాయని, ఇది కేవలం యాదృచ్ఛికంగా జరిగిందో లేదో తెలియదని ఆయన అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీని ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాను బహిష్కరించాలంటూ వైసీపీ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో పృథ్వీ క్షమాపణలు చెప్పారు.

# అనారోగ్యం వల్ల ఒక్కోసారి వైవాహిక జీవితంలో భారీ మూల్యం

## విడాకులపై సమంత కామెంట్



అక్కినేని నాగచైతన్య, సమంత 2017లో ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఈ జంట... 2021లో విడాకులు తీసుకుంది. అయితే... విడాకులకు కారణాలు వీరిద్దరూ వేర్వేరుగా చెప్పడమే కొన్ని సార్లు చర్చనీయాంశం అవుతోంది. ఆ మధ్య ఓ పాడ్ కాస్ట్ లో నాగచైతన్య 'తాను సమంత పరస్పర అంగీకారంతోనే విడాకులు తీసుకున్నామ'ని చెప్పాడు. మాకున్న వ్యక్తిగత కారణాలతో ఎవరి మార్గంలో వారు ప్రయాణం చేయాలని అనుకున్నాం. అందుకే విడాకులు తీసుకున్నాం' అని స్పష్టం చేశాడు. తాజాగా సమంత మాత్రం విడాకులు విషయంలో వేరే వర్షన్ ను చెప్పింది. ప్రతి మనిషి మానసికంగానే కాకుండా శారీరకంగానూ ఎంతో ఆరోగ్యంగా ఉండాలి. అలా లేని పక్షంలో దాని ప్రభావం వైవాహిక జీవితం మీద పడుతుందని తెలిపింది. జీవిత భాగస్వామి ఎంత విశాల హృదయుడైనా... ఎంత మనసున్నవాడైనా... ఒక్కోసారి పార్టనర్ అనారోగ్యం కారణంగా వారి మధ్య గ్యాప్ ఏర్పడుతుందని ఇన్ డైరెక్ట్ గా చెప్పింది. లైఫ్ పార్టనర్ పట్ల మనకు ఉన్న ప్రేమను వ్యక్తం చేయడంలో ఒక్కోసారి అనారోగ్యం అడ్డుపడుతూ ఉంటుందని, దాంతో భారీ మూల్యం చెల్లించాల్సి రావొచ్చని నర్మగర్భంగా సెలవిచ్చింది. మొత్తం మీద తన అనారోగ్యమే విడాకులకు పరోక్షకారణమని చెప్పకనే సమంత చెప్పేసింది. ఇదిలా ఉంటే ఇటీవల శోభితా ధూళిపాలను వివాహం చేసుకున్న నాగచైతన్య 'తండేల్' విజయంతో ముందుకు సాగిపోతున్నాడు. అలానే... సమంత విడాకుల అనంతరం వెబ్ సీరిస్ మీద దృష్టి పెట్టి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని నటిగా కొనసాగుతోంది. ప్రస్తుతం నిర్మాతగానూ తన సత్తాను చాటాలని తహతహలాడుతోంది.

# వాలంటైన్స్ డే స్పెషల్.. థియేటర్లలోకి 'ఆరెంజ్' మూవీ




వాలంటైన్స్ డే స్పెషల్ గా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన రొమాంటిక్ సినిమా 'ఆరెంజ్' రీ రిలీజ్‌కు రెడీ అయింది. రేపు ప్రేమికుల రోజు సందర్భంగా ఈ మూవీ థియేటర్లలో సందడి చేయబోతోంది. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రామ్ చరణ్, జెనీలియా హీరోహీరోయిన్లుగా 'ఆరెంజ్' సినిమా తెరకెక్కింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. కానీ ఈ సినిమా అప్పటి యూత్, మెగా ఫ్యాన్స్‌కి ప్రత్యేకమనే చెప్పాలి. అసలు ప్రేమ ఎంతకాలం ఉంటుందనే నిజాన్ని 'ఆరెంజ్'తో తెలియజేశాడు దర్శకుడు. 2010 నవంబర్ 26న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద ఆశించిన విజయం సాధించలేదు. అయితే ఆ తర్వాత కల్ట్ క్లాసిక్ స్టేటస్ అందుకుంది. ఇందులో లవర్ బాయ్ గా చరణ్ నటనకు మంచి మార్కులు పడ్డాయి. జీవితాంతం ప్రేమ అనేది అబద్ధం, కొంతకాలం మాత్రమే ప్రేమ బాగుంటుందనే సరికొత్త కాన్సెప్ట్ తో దర్శకుడు భాస్కర్ చిత్రాన్ని తెరకెక్కించాడు.ప్రేమ ఎప్పుడు ఒకేలా ఉండదు అనే నిజాన్ని ఈ సినిమా ద్వారా చూపించే ప్రయత్నం చేశాడు డైరెక్టర్. ముఖ్యంగా పాటలతో సంగీత ప్రియులను అలరించిన 'ఆరెంజ్' మూవీ వాలంటైన్స్ డే సందర్భంగా మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. 2023లో ఈ సినిమా రీ రిలీజ్ అవ్వగా దీనికి మంచి స్పందన వచ్చింది. మరి ఇప్పుడు ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూడాలి. ఇప్పటికే మేకర్స్ రీ రిలీజ్ ట్రైలర్ ను కూడా విడుదల చేశారు.